విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, జూన్ 24: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. సోమవారం జిల్లా వైద్యాధికారుల సూచనల మేరకు జహీరాబాద్ పట్టణంలోని గిరిజన బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన సికిల్ సెల్ అనీమియా నిర్మూళన దినోత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత రాకుండా వైద్యసిబ్బంది చూడాలన్నారు. వారికి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఎంపీడీవో మహేందర్ రెడ్డి, డాక్టర్ సొహైల్, నారాయణ ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 24: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇంటర్ జనరల్ కేటగిరీ ఫలితాలకు సంబంధించి మొదటి సంవత్సరం ఫలితాల్లో భాగంగా మొత్తం 9,358 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 5,456 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. దీంతో 58.3 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఇందులో బాలురు 4,624 మంది పరీక్ష రాయగా, 2,378 మంది ఉత్తీర్ణత సాధించారు. 51.43 ఉత్తీర్ణత శాతం నమోదైంది. బాలికలు 4,734 మంది పరీక్షకు హాజరుకాగా, 3,078 మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. దీంతో 65.02 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో బాలికలు బాలుర కంటే 13.59 శాతం అధిక ఉత్తీర్ణతతో పైచేయిగా నిలిచారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మొత్తం 5,213 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 2,277 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 43.68 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికలు బాలుర కంటే 5.16 శాతం అధిక ఉత్తీర్ణతతో పైచేయి సాధించారు. వొకేషనల్ కేటగిరీలో మొదటి సంవత్సరంలో 600 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 331 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 391 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 190 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 48.59 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేయాలి

కోహీర్, జూన్ 24: ప్రజాపాలనలో వేలాది మంది దివ్యాంగులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక డివిజన్ అధ్యక్షుడు నర్సింహులు కోరారు. ఈ మేరకు సోమవారం జహీరాబాద్‌లోని ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకొని ఆరు నెలలు గడిచినా ఇంతవరకు మంజూరు చేయలేదని మండిపడ్డారు. దివ్యాంగులకు ప్రతి నెల 5లోగా పింఛన్లు ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం దివ్యాంగులకు ప్రత్యేకంగా రూ.6.25లక్షలు కేటాయించాలని కోరారు. ఆదాయ పరిమితి విధించే జీవో 17ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, రాజు, వాజీద్, శివరాజ్, మచ్చేందర్, తదితరులున్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

రామచంద్రాపురం, జూన్ 24: ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ సండే మార్కెట్ వద్ద రూ.40 లక్షలతో వేస్తున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రతి కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్‌లను పునరుద్ధరించిన తర్వాత సీసీ రోడ్డు పనులను చేపడుతున్నామని తెలిపారు. సండే మార్కెట్ ఏరియాలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తికావడంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. సీసీ రోడ్డు పనులను వేగంగా పూర్తి చేయిస్తామని తెలిపారు. మాజీ కార్పొరేటర్ అంజయ్య, ఏఈ ప్రభు, నర్సింహ, సత్యనారాయణ, నాగరాజు, మాణిక్యం, మల్లేశ్, మల్లికార్జున్, వసీమ్, సాయిలు, నవీన్, రవి, నాగభూషణంచారి, బిట్టు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

ఆర్డీవోకు రికార్డులు అందజేత

జిన్నారం, జూన్ 24: మంగంపేట పరిధిలోని సర్వే నంబర్ 55లో నిర్మించిన పల్లె ప్రకృతి వనం, డంప్‌యార్డు నిర్మాణ వివరాలను గ్రామస్తులు సోమవారం ఆర్డీవో వసంతకుమారికి అందజేశారు. ఇదే సర్వేనంబర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ పహణీలను, మంగంపేట నుంచి ఊట్ల శివారు వరకు మట్టితో వేసిన లింకు రోడ్డు ఎంబీ రికార్డులతోపాటు పల్లె ప్రకృతి వనం, డంప్‌యార్డు ఎంబీ రికార్డులను అందజేశారు. సర్వే నంబర్ 55 ప్రభుత్వ భూమిలోనే ఇవన్ని ఉన్నాయని, వీటిని ఓ పరిశ్రమ కూల్చివేసి ఆక్రమించుకొన్నదని తెలిపారు. దీనిపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సార నరేందర్, లక్ష్మణ్, లక్ష్మణ్‌రావు, వెంకటేశ్, రాజభార్గవ, శ్రీకాంత్, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో వసంతకుమారికి రికార్డులు అందజేస్తున్న మంగంపేట గ్రామస్తులు

రైతులకు న్యాయం చేయండి

జిన్నారం, జూన్ 24: మండల కేంద్రం జిన్నారం పరిధిలోని సర్వే నంబర్ 1, జంగంపేట పరిధిలోని సర్వే నంబర్ 376లోని రైతులకు తక్షణమే న్యాయం చేయాలని ప్రజాప్రతినిధులు, నాయకులు తహసీల్దార్‌ను కోరారు. సోమవారం ఎంపీపీ రవీందర్‌గౌడ్, జిన్నారం ఎంపీటీసీ లావణ్యనరేశ్ జిన్నారం, జంగంపేట రైతులతో కలిసి తహసీల్దార్ భిక్షపతిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిన్నారం, జంగంపేట రైతులను మభ్యపెట్టి వారి భూములను తీసుకొని మూడు సంవత్సరాలుగా ఎలాంటి న్యాయం చేయకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎకరాకు 600 గజాల స్థలం ఇస్తామని చెప్పి గజం కూడా ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, మండల ఉపాధ్యక్షుడు రాజుగౌడ్, మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్, నాయకులు నరేశ్, నరేందర్‌గౌడ్, గుమ్మడిదల మాజీ సర్పంచ్ తులసీదాస్, బత్తుల మహేశ్, వెంకటేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిలు చెల్లించాలి

బొల్లారం, జూన్ 24: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిదారులకు కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు సోమవారం అధికారులు డిమాండ్ నోటీసులు జారీ చేశారు. ఆర్వో శ్రీధర్ నేతృత్వంలో బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు పన్ను బకాయిదారుల ఇంటింటికి వెళ్లి డిమాండ్ నోటీసులు అందజేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సకాలంలో పన్ను చెల్లింపులు చేసిన యజమానులకు జూన్ వరకు ఎలాంటి పెనాల్టీ లేకుండా చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు ప్రదీప్, నారాయణ, రఘురాంరెడ్డి, అలీ, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

బయటపడిన వేంకటేశ్వరుడి విగ్రహం

నారాయణఖేడ్, జూన్ 24: నారాయణఖేడ్ మండలం హన్మంత్‌రావుపేట్‌లో పొలం చదును చేస్తుండగా వేంకటేశ్వర స్వామి పంచలోహ విగ్రహం బయటపడిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు రాజు, సంగమేశ్వర్ తమ పొలాన్ని జేసీబీ సహాయంతో చదును చేస్తున్న క్రమంలో జేసీబీకి ఏదో తగిలినట్లు శబ్దం వచ్చింది. అక్కడ తవ్వి చూడగా అడుగు ఎత్తు, రెండున్నర కిలోల బరువు గల పంచలోహ వేంకటేశ్వరస్వామి విగ్రహం బయల్పడింది. విగ్రహాన్ని గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భద్రపర్చడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని దర్శించుకున్నారు.

ఉరుకులు.. పరుగులు

నిత్యం సమస్యలపై ఫోకస్.. ప్రచురించే కథనాలపై అధికారుల ఉరుకులు పరుగులు.. పరిష్కార మార్గాలు చూపే నమస్తే తెలంగాణ కథనాలు సమాజంలో మార్పునకు దోహదపడుతున్నాయి. నమస్తే తెలంగాణలో ఇటీవల ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. పరిష్కార మార్గాలు చూపారు. మళ్లీ పునరావృతం కాకుండా చర్యలకు ఉపక్రమించారు.

- నమస్తే తెలంగాణలో వస్తున్న కథనాలపై స్పందిస్తున్న అధికారులు
- ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చర్యలు

పంచాయతీ కార్యదర్శికి మెమో జారీ

- సుక్కలు చూస్తున్న నక్షత్రవనం కథనానికి స్పందన
- అదనపు కలెక్టర్‌కు ఎంపీడీవో సంజాయిషీ

సుక్కలు చూస్తున్న నక్షత్రవనం

సంగారెడ్డి, జూన్ 24: పల్లె ప్రకృతి వనాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వనాలపై అధికారులు అలసత్వం చేయడం తో పంచాయతీ కార్యదర్శికి ఎం పీడీవో యాదవరెడ్డి మెమో ఇచ్చారు. సోమవారం మండల ప రిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథ కం ఏపీవో, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించి కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగా మొక్కలు ఎండిపోయాయని అంగీకరించి మళ్లీ మొక్కలు నాటాలని ఆదేశించారు. ఆదివారం నమస్తే తెలంగాణ లో ప్రచురితమైన 'సుక్కలు చూస్తున్న నక్షత్ర వనం' కథనంపై అధికారులు స్పందించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు సంజాయిషీని ఇస్తూ పూర్తిగా కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగా నక్షత్ర వనంలో మొక్కలు ఎండిపోయాయని, దీనికి కారణం మొక్కలకు నీళ్లందించే బోరు మోటర్ కాలిపోవడమేనని తెలిపారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకొని మొక్కలు పెంచుతామని వివరణ ఇచ్చారు. ఈ వనమహోత్సవ కార్యక్రమంలో కొత్తగా నాటే మొక్కల బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామని ఎంపీడీవో అదనపు కలెక్టర్‌కు సంజాయిషీని ఇచ్చారు.

బాగుపడిన నేరడిగుంట

- పిచ్చి మొక్కలు తొలిగింపు
- డ్రైనేజీలు శుభ్రం చేయించిన అధికారులు
- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

అందోల్, జూన్ 24: నేరడిగుంటలో ఇండ్ల పరిసరాలు బాగుపడ్డాయి. డ్రైనేజీలు శుభ్రమయ్యాయి. సోమవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన 'పారిశుధ్యం అస్తవ్యస్తం' గ్రామాల్లో పడకేసిన ప్రత్యేక పాలన కథనంపై అధికారులు స్పందించారు. కొన్ని నెలలుగా పేరుకుపోయిన చెత్తను, ఇండ్ల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లకొమ్మలు తొలిగించి మురికి కాల్వలు శుభ్రం చేయించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా గ్రామంలో చెత్త పేరుకుపోయి, పిచ్చిమొక్కలు మొలిచి మురికికాల్వలు నిండి దుర్గంధం వ్యాపించింది. నమస్తే కథనంతో కదిలిన అధికారులు ఆగమేఘాల మీద పరిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నర్సింహస్వామి తోపాటు పలువురు అధికారులు దగ్గరుండి వీధులు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లారు. ఇకపై ఎప్పటికప్పుడూ పారిశుధ్య పనులు చేపడుతామని కార్యదర్శి తెలిపారు.

నేరడిగుంటలో పిచ్చిమొక్కలు తొలిగించి, డ్రైనేజీలు శుభ్రం చేసిన అధికారులు

హత్నూరలో భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు

హత్నూర, జూన్ 24: మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీకి సోమవారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో సోమవారం మండల కేంద్రంలోని హత్నూర ప్రభుత్వ పాఠశాల సమీపంలో 'వృథాగా పోతున్న భగీరథ నీరు' అనే శీర్షిక ప్రచురితం కావడంతో మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. సోమవారం ఉదయం పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీని అరికట్టేందుకు సిబ్బందితో మరమ్మతులు చేయించినట్లు మిషన్ భగీరథ ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.

గుట్కా అమ్మితే చర్యలు

న్యాల్‌కల్, జూన్ 24: నిషేధిత గుట్కా ప్యాకెట్లు, తంబాకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండలంలోని హద్నూర్ ఎస్ఐ రామానాయుడు హెచ్చరించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సోమవారం రాత్రి మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామంలోని కిరాణాషాపులు, పాన్‌షాపుల్లో తనిఖీలు చేశారు. గుట్టా ప్యాకెట్లు, తంబాకు, జర్దా ప్యాకెట్లు లభించిన పాన్‌షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఆక్రమణదారులపై కేసు

న్యాల్‌కల్, జూన్ 24: ఓ రైతుకు చెందిన భూమిని ఆక్రమించేందుకు పాల్పడడమే కాకుండా దాడిచేసి గాయపర్చిన వారిపై కేసు నమోదు చేసినట్టు హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఆత్నూర్ గ్రామానికి చెందిన గొల్ల సిద్ధన్న అనే రైతుకు చెందిన భూమిలో ఆదివారం ఆదే గ్రామానికి చెందిన సింగూర్ పాషా, అతని భార్య అమీనాబీ, కుమారులు ఖాజ, అల్తాఫ్ అక్రమంగా భూమిలోకి ప్రవేశించి ట్రాక్టర్‌తో సాగులో ఉన్న పంటను ధ్వంసం చేశారు. తన భూమిలోకి ఎందుకు వచ్చారని రైతు వారిని ప్రశ్నిస్తే దాడిచేసి తీవ్రంగా గాయపర్చారు. సోమవారం బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామనాయుడు పేర్కొన్నారు.

వేతనాలు పెంచాలి

సంగారెడ్డి, జూన్ 24: బిబో పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా బెదిరింపులకు పాల్పడుతున్న పరిశ్రమ ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని డీసీఎల్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయంలో డీసీఎల్ రవీందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు యాదగిరి, జరీన, ఎల్లయ్య, సరిత, సుజాత, మహేశ్వరి పాల్గొన్నారు.

క్రషర్ ఏర్పాటుపై ఫిర్యాదు

జిన్నారం, జూన్ 24: రాళ్లకత్వ పరిధిలోని సర్వే నంబర్ 286 అసైన్డ్ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా కంకర క్రషర్ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నారని గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జిల్లా మైనింగ్, పీసీబీ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. వివరాలు తెలపాలని ఆర్‌టీఐ యాక్ట్ కింద దరఖాస్తు చేశారు. దీనిపై విచారణ జరపాలని, పూర్తి వివరాలను అందజేయాలని కోరారు.

విద్యాభివృద్ధికి సహకరిస్తా..

కల్హేర్, జూన్ 24 : నియోజకవర్గ పరిధిలో విద్యాభివృద్ధికి సహకరిస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం కల్హేర్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన ఫిజిక్స్ ఉపాధ్యాయుడు బాచ శ్రీనివాస్ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై దంపతులను సన్మానించారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా అధికారులు

ప్రజావాణికి 75 అర్జీలు

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 24: కలెక్టరేట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అందజేసి పరిష్కరించాలని కోరారు. ఆయా దరఖాస్తులను అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురీలతో కలిసి స్వీకరించిన కలెక్టర్ వాటిని సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో మొత్తం 75 అర్జీలు అందగా, అందులో 40 రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా, ఇతర శాఖలకు సంబంధించి 35 అర్జీలు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మజారాణి పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై జాతీయ సదస్సు

కంది, జూన్ 24: నూతన విద్యా విధానంపై ఐఐటీ హైదరాబాద్‌లో జాతీయ సదస్సు నిర్వహించారు. సహారా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నూతన విద్యా విధానం, విద్య, ఆరోగ్యంపై ఐఐటీహెచ్ ఆడిటోరియంలో రెండు రోజులపాటు జరగనున్న జాతీయ సదస్సును సోమవారం ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ప్రారంభించారు. అభ్యాసం, విభిన్న సూచనలు, యూనివర్సల్ డిజైన్ అంశాలపై జరుగుతున్న సదస్సులో దేశం నలుమూలల నుంచి 100 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి సహారా ఆర్గనైజేషన్‌ను అభినందించారు. అనంతరం సహారా డైరెక్టర్ శంకర్ మటం మాట్లాడుతూ సంగారెడ్డిలోని సహారా ఆర్గనైజేషన్ నుంచి దివ్యాంగ పిల్లలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఐఐటీహెచ్‌లో సదస్సును ప్రారంభిస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

'బస్తీదర్శన్'తో సమస్యలు పరిష్కారం

రామచంద్రాపురం, జూన్ 24: బస్తీదర్శన్ కార్యక్రమంతో ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని ఎల్ఐజీలో జల మండలి, బల్దియా అధికారులతో కలిసి ఆమె బస్తీదర్శన్ నిర్వహించారు. పలు సమస్యలను కాలనీవాసులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన రూ.51లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని బల్దియా అధికారులకు ఆమె ఆదేశించారు. విద్యుత్‌నగర్‌కాలనీలో తెల్లాపూర్ మున్సిపాలిటీ వారు వేస్తున్న యూజీడీ పైప్‌లైన్‌తో అన్నమయ్య ఎన్‌క్లేవ్ దగ్గర ఓపెన్ సీవరేజ్ సమస్య ఏర్పడుతుందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. తెల్లాపూర్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, కమిషనర్ సంగారెడ్డి, బల్దియా జలమండలి అధికారులతో చర్చించి సమన్వయంతో ఓపెన్ సీవరేజ్ ప్రాంతాన్ని సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అక్రం, వాటర్‌వర్క్స్ ఏఈ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న యాదగిరిరెడ్డి

పెన్షన్ తీసుకోవడంలో తోపులాట

పెన్షన్‌దారులతో రద్దీగా మారిన పాత మున్సిపల్ కార్యాలయం

బొల్లారం, జూన్ 24: మున్సిపాలిటీ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పెన్షన్ తీసుకోవడానికి వచ్చిన 1,100మంది లబ్ధిదారులతో పోస్టాఫీస్ ప్రాంగణం రద్దీగా మారింది. కాస్త తోపులాట చోటుచేసుకుంది. దీంతో వృద్ధులు, దివ్యాంగులు అసహనానికి గురయ్యారు. సకాలంలో అధికారులకు పెన్షన్ ఇవ్వడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. విషయం తెలుసుకున్న సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డి పెన్షన్‌దారులను సముదాయించి అధికారులతో మాట్లాడారు. సంయమనం పాటిస్తూ వంద మందికి టోకెన్లు జారీ చేసి పెన్షన్లు అందించేలా చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం పెన్షన్‌దారులు సజావుగా పెన్షన్ అందుకున్నారు.

834 మంది ఉపాధ్యాయులు బదిలీ

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 24: జిల్లాలో లోకల్ బాడీ యాజమాన్యం కింద స్కూల్ అసిస్టెంట్స్ తత్సమాన ఉపాధ్యాయ కేటగిరీల్లో బదిలీ ప్రక్రియ పూర్తయిందని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు సోమవారం ప్రకటనలో తెలిపారు. తెలుగు మీడియంలో 529 మంది, ఉర్దూలో 39 మంది, కన్నడ మీడియంలో ఇద్దరు, లాంగ్వేజ్ టీచర్స్ 264 మంది బదిలీ ఉత్తర్వులు పొందారని వివరించారు. మొత్తం 834 మందికి బదిలీ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్య

బొల్లారం, జూన్ 24: బొల్లారం మున్సిపల్ పరిధిలోని బాలాజీ నగర్‌లో నివసించే రాజస్థాన్‌కు చెందిన ప్రియ(19) అనుమానాస్పద స్థితిలో అద్దెకు ఉండే గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రెండు రోజుల తర్వాత సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

నారాయణఖేడ్, జూన్ 24: లక్షే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా సోమవారం నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ మల్లేశయ్య ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగస్తుల పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లల్లో సృజనాత్మకత బయటపడుతుందన్నారు. దశరథరావు, నర్సింహులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

శకుంతలాదేశ్‌పాండే మృతి

కోహీర్, జూన్ 24: నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం నిర్వహించిన దీశాలి ఇకలేరు. మండలంలోని మనియార్‌పల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు వామన్‌రావు దేశ్‌పాండే సతీమణి శకుంతలాదేశ్‌పాండే(93) సోమవారం ముంబాయిలో మృతి చెందింది. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారు. జైల్లో ఉన్న సాయుధ పోరాట యోధులకు తమ ఇంటి నుంచి ఆహారాన్ని తీసుకువెళ్లి అందించే వారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆమె పోరాటాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పింఛన్ మంజూరు చేసింది. ఆమెకు మనియార్‌పల్లి గ్రామస్తులు సంతాపం తెలిపారు.

రెచ్చిపోయిన దొంగలు

కోహీర్, జూన్ 24: మొగుడంపల్లి మండలంలోని ఇప్పెపల్లి, ఖాన్‌జమాల్‌పూర్, గొటిగార్‌పల్లి గ్రామాల్లో ఆదివారం రాత్రి పశువులను దొంగిలించారని బాధితులు బేగరి రాంచందర్, బేగరి నర్సింహులు తెలిపారు. కర్ణాటకకు చెందిన కొంతమంది దొంగలు వాహనంలో వచ్చి ఆదివారం రాత్రి పశువులను తీసుకువెళ్లేందుకు యత్నించారు. రైతులు ఆ వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో డ్రైవర్ వారిని ఢీకొట్టి వెళ్లడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. సోమవారం తమకు న్యాయం చేయాలని చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్సై నరేశ్‌ను కోరారు.

చోరీలను అరికట్టండి

సంగారెడ్డి, జూన్ 24: కాయకష్టం చేసుకొని కూడబెట్టుకున్న సొమ్ము దొంగలపాలు అవుతుందని, పోలీసులను సంప్రదిస్తే పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఎస్పీ చెన్నూరి రూపేశ్‌కు విన్నవించారు. సోమవారం ప్రజా విజ్ఞప్తుల్లో భాగంగా కొండాపూర్ మండలం గొల్లపల్లిలో ఆరునెలలుగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయని, కొండాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందనలేదని ఎస్పీకి ఫిర్యాదులో వివరించారు. ఏప్రిల్ 18 నుంచి ఐదు ఇండ్లలో దొంగతనాలు జరిగాయని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన షరీఫాబీ ఇంట్లో రూ.3లక్షల నగదుతోపాటు 8 తులాల బంగారం, 30 తులాల వెండి దొంగిలించారు. 30 ఏప్రిల్ 2024న గడల సదాశివుని ఇంట్లో రూ.50వేలను ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత మంత్రిగారి శ్రీనివాస్ ఇంట్లో దొంగతనానికి రావడంతో ఇంట్లోని సత్యమ్మ దొ